నరవలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర - పెందుర్తి : నరవ బెహరా నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నాలుగో రోజు గణంగా నిర్వ హించారు. వారం రోజులపాటు తల్లి పాల వారోత్స వాలను పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, బాలింతల గృహాల్లో నిర్వహిస్తున్నామని కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ డా. హిందుమతి తెలిపారు. కొత్త పాలెం, నాగేంద్ర కాలనీలోని అంగన్వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బాలిం తలకు తల్లి పాలు వల్ల బిడ్డలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం బాలింతల గృహాల్లో ప్రసవానంతరం చేయవలసిన వ్యాయామాలపై విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల అధ్యాపకులు అనుషప్రియ, నీరజ, సంయుక్త, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా త్రాగునీటి వనరులను అభివృద్ధి చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర - తగరపువలస : ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా త్రాగునీటి వనరులను భీమిలి తగరపువలస పరిసర ప్రాంతాలలో అభివృద్ధి చేసి ప్రజలకు మేలు చేయాలని సిపిఐ వారు అధికారులను కోరారు. సోమవారం తగరపువలస సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యదర్శి కానూరు రాంబాబు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మరియు జోనల్ కమిషనర్ను ఈ విధంగా కోరారు. ఈ వర్షాకాలంలో సకాలంలో వర్షాలు కురవకపోవడం వలన గోస్తని నది నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. అలాగే దివిస్ కంపెనీ వారు గోస్తని నది నీరును విపరీతంగా దోచుకుపోవటం వల్ల నీటి నిల్వలు ఇంకా తగ్గిపోయాయి. నీరు నిలువలు గురించి ప్రత్యేక మార్గాలు చేయకపోవడం ఉదాహరణకు పూనుగట్టు దగ్గర గట్టును పెంచక పోవడం ఒక కారణం పాత బ్రిడ్జి దగ్గర నీరు నిలవ గట్లు పెంచక పోవడం ఒక కారణం మరియు ప్రజలకు వచ్చే రోజుల్లో నీరు కొరత రాకున్నా అధికారులు తగు చర్యలు చేపట్టాలి అని సీపీఐ పార్టీగా కోరుచున్నాము అని తెలిపారు. భవిష్యత్తులో ప్రజల అవసరాలు తీర్చేందుకు గోదావరి జలాలు విశాఖపట్నంకు వచ్చిన సందర్భంలో భీమిలి మున్సిపాలిటీ జీవీఎంసీ వారు గోదావరి నది నీళ్లు తెచ్చి నిల్వలు చేసేందుకు చిన్నపాటి డ్యాములు నిర్మాణం చేయవలసిన అవసరం ఉన్నదని అభిప్రాయం వ్యక్తం చేసారు. జీవీఎంసీ భీమిలి తగరపువలస చిట్టివలస ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు తగిన సరైన ప్రణాళికలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని తేల్చి చెప్పారు. భీమిలి పరిసర ప్రాంతాలలో బోరు బావులు తవ్విన శుద్ధ నీరు ఉప్పునీరు పడటం వలన అవి త్రాగునీటి అవసరాలకు ఉపయోగ పడక మినరల్ వాటర్ కొనుక్కొని తాగి ఖర్చు భరించలేక ప్రజలు అనేక అవస్థలకు గురవుతున్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత మరియు భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టు ప్రణాళికలు రూపొందించి ప్రజలకు త్రాగునీరు అందించాలని ప్రభుత్వం వారిని కోరారు. ఈ కార్య క్రమంలో భీమిలి ఏరియా సీపీఐ కార్యదర్శి రాంబాబు సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు సభ్యులు ముత్యాలరావు అప్పారావు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా నిలబడాలి : ఎమ్మెల్యే గంటాశ్రీనివాసరావు

విశాలాంధ్ర - భీమిలి : దేశానికి అన్నం పెట్టే రైతు సంక్షేమానికి కృషి చేసి.. వారికి అండగా నిలబడాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. భీమిలి వ్యవసాయ మార్కెట్ ఆఫీస్ లో కొత్త కమిటీతో సోమవారం ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం మాట్లాడుతూ కేంద్రంలోనూ.. రాష్ట్రంలోనూ.. రైతు కోసం పని చేసే ఎన్డీయే ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయన్నారు. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 14 వేలు పీఎం కిసాన్ కింద రూ. 6 వేలు కలిపి ఏడాదికి రూ. 20 వేల చొప్పున 46.85 లక్షల మంది రైతులకు రూ. 9 వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం అందిస్తున్నట్టు వెల్లడించారు. రైతు బిడ్డగా వ్యవసాయ కష్టం తనకు తెలుసునని.. పండించే పంట ధర నిర్ణయించు కోలేని నిస్సహాయత రైతుదని ఆవేదన వ్యక్తం చేశారు. భీమిలిలో బలమైన జనసేన నాయకుడైన పంచకర్ల సందీప్ కూటమి ధర్మానికి కట్టుబడి తనకు 93 వేల రీసౌండ్ మెజారిటీ రావడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాజకీయంగా భవిష్యత్ లో సందీప్ ఉన్నత స్థాయికి వెళ్తారన్నారు. అధికారంలో ఉండగా ఇంట్లో నుంచి బయటకు రాకుండా చంద్రబాబు గేటును తాళ్లతో కట్టేసిన.. విశాఖలో పవన్ కళ్యాణ్ను హోటల్ నుంచి బయటకు రానివ్వని, జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తుందనడం పట్ల మండిపడ్డారు. చంద్రబాబు తలుచుకుంటే జగన్ ఇంట్లోంచి కాలు సైతం బయట పెట్టలేరని వ్యాఖ్యానించారు. కేవలం ప్రజాస్వామ్యంపై గౌరవంతో జగన్ పర్యటనలకు 2 వేల నుంచి 3 వేల మంది పోలీసులను రక్షణ కోసం ఉంచుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఇదే స్థాయిలో కొనసాగితే ఒక్క సీటు కూడా దక్కదనే ఫ్రస్టేషన్ లో జగన్మోహన్ రెడ్డి పిచ్చి పీక్స్ కి వెళ్లిపోయిందని ఎద్దేవా చేశారు. ప్రధాన కేసుల్లో నిందితుడుగా ఉన్న దోషులను స్వాతిముత్యాలుగా ప్రజలకు పరిచయం చేసిన ఆణిముత్యం జగన్మోహన్ రెడ్డి అని విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం మాధవి, మాజీ మంత్రి పడాల, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల సందీప్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురుమిన రామస్వామి నాయుడు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కూటమి నాయకులు సరగడ అప్పారావు, డి.ఎ.ఎన్. రాజు, కసిరెడ్డి దామోదరరావు, చెట్టిపల్లి గోపీ, బొడ్డేటి రఘు, కైలాష్ రెడ్డి, అక్కరమాని వెంకట్రావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి నాధునికి విరాళాలు

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారికి ఒడిస్సా దాసుడు ప్రసాదాలు మోసుకెళ్ళేందుకు 4 ఇత్తడి తట్టలు, 4 ఇత్తడి గిన్నెలు, అహుజా ఆంప్లిఫైర్, రెండు కార్డ్ లెస్ మైక్ లు ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి తిరుమలేశ్వర రావు కు అందజేశారు. అదేవిధంగా మహారాణి పేట, విశాఖకు చెందిన సూర్య ప్రకాశరావు, శ్రీలక్ష్మీ, కె.రవిశంకర్, భాగ్య నిరంజన్ లు రూ. 1,00,000/-లు నిత్యాన్న ప్రసాద పథకానికి విరాళంగా చెక్కును సీనియర్ గుమస్తా సూర్య నారాయణకు అందజేశారు. ఆలయ మర్యాదలు ప్రకారం దాతకు స్వామివారి ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారికి భక్తులు, దాతలు ఏమైనా వస్తువులు, ధన, చెక్కు, డిడి రూపేణా విరాళం ఇచ్చిన సంబంధిత అధికారి వద్ద తగు రసీదు పొందాలని లేదంటే వారు ఇచ్చిన విరాళాలు స్వామివారికి చెందవు అని అధికారులు తెలిపారు. దాతలకు ఎటువంటి సమాచారం కావాలన్నా 9491000635 నెంబర్ కు సంప్రదించ వచ్చు లేదంటే నేరుగా మమ్మల్ని అంటే దేవ స్థానం కార్యనిర్వహణాధికారి వారిని సంప్రదిం చగలరు అని ఇంచార్జ్ ఈఓ త్రినాధరావు తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు తొమ్మిది అర్జీలు

విశాలాంధ్ర - భీమిలి : జోన్-1, జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంకు 09 అర్జీలు వచ్చినవి. పట్టణ ప్రణాళిక విభాగానికి-04, ప్రజా రోగ్యం విభాగానికి-01, ఇంజనీరింగ్ విభాగానికి -03, రెవెన్యూ విభాగానికి-01తదుపరి చర్యలకు సంబంధిత శాఖాధిపతులకు పంపడం జరిగిందని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

పదవులు బాధ్యతలను పెంచుతాయి

విశాలాంధ్ర - పెదగంట్యాడ : పదవులు భాద్యతలను పెంచుతాయి అని స్టీల్ ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎస్. మోహన్ బాబు అన్నారు. ఉక్కు క్లబ్ కార్యదర్శిగా ఎన్నికైన శ్యాం సుందర్‌రావును మోహన్ బాబు మర్యాద పూర్వ కంగా కలిసి బొకే, శాలువాతో ఘనంగా సత్క రించారు. ఆయన మాట్లాడుతూ పదవులు భాద్య తలను పెంచు తాయి అని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ యూత్ హాస్టల్స్ అసోసి యేషన్ చైర్మన్ సి.హెచ్.రవి పాల్, యూత్ హాస్టల్స్ ట్రెజరర్ ఈ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్ ప్రవేశాలు

విశాలాంధ్ర - భీమిలి : భీమునిపట్నం లోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా కోర్సులలో మిగులు సీట్లకు (కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ (సీసీపీ) మరియు సివిల్ ఇంజనీరింగ్ విభాగలలో తక్షణ ప్రవేశాలకు 05/08/2025వ తేది స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తు న్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్ మురళీకృష్ణ తెలిపారు. పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష రాయక పోయినా, పదో తరగతి కంపార్ట్ మెంటల్ ద్వార పాసైన విద్యార్థినులు కూడ ధరఖాస్తు చేసుకోవచ్చని తెలి పారు. ఆసక్తి గల విద్యార్థినులు ఎస్.ఎస్.సి మార్క్స్ లిస్ట్, (పాలిసెట్-2025 హాల్ టికెట్ మరియు ర్యాంక్ కార్డు పరీక్షకు హాజరైనచో), టి.సి, క్యాస్టు సర్టిఫికేట్, 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు స్టడి సర్టిఫికేట్, ఆధార్ సర్టిఫికేట్ ఒరిజినల్స్ మరియు 3 సెట్స్ జిరాక్స్ కాపీలు, పాస్ ఫోటోస్ 2 ఫీజు రూ.5,800/- తో 05/08/2025వ తేదీన ఉదయం 9-30 గంటలకు భీమునిపట్నం లోగల మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు హాజరు కావలసిందిగా ప్రకటనలో తెలిపారు.

రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - పెదగంట్యాడ : జీవీఎంసీ 76 వార్డు గోపాల రెడ్డి నగర్ వద్ద డ్రైనేజీ నిర్మాణం కొరకు సుమారు రూ.2 కోట్లుతో అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పాల్గొని శంకు స్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్ గంథం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎల్.ఏ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని వార్డులలో ఉన్న ప్రధాన గెడ్డలు అన్ని రిటర్నింగ్ వాల్‌తో నిర్మాణ పనులు చేపడుతున్నామని అన్నారు. వీటి వలన వర్షా కాలంలో ముంపు సమస్య తప్పుతుందని డ్రైనేజీ సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని అన్నారు. కార్పొరేటర్ గంథం శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డులో చాలా వరకు అన్ని లోతట్టు ప్రాంతాలు అని ఈ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చేయడం వలన ముంపు ప్రాంతాలు అన్నిటికీ చాలా వరకు మేలు జరుగుతుందని అన్నారు. కార్య క్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, వార్డు అధ్యక్షుడు జిత్తుక రాజు, సెక్రటరీ కూన వెంకట్రావు, జీలకర రమణ, నాగ రాజు, గెద్దం, రమణ, సురేష్, కె.నాగు, రాము నాయుడు, శివ, సోములు, కుమార్, మూర్తి, కృష్ణ, మురళి, లక్ష్మీ కూటమి నాయకులు కార్య కర్తలు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలి
జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైతే క్షేత్రస్థాయి పరిశీలన చేసి నాణ్యమైన రీతిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో సంబంధిత అధికారి లేదా సిబ్బంది తప్పని సరిగా ఫోన్ ద్వారా సంప్రదించాలని, సమస్య పూర్వాపరాలను తెలుసుకొని సంతృప్తికర రీతిలో పరిష్కారం చూపాలని సూచించారు. రీ ఓపెన్ అవుతున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, తగిన విధంగా ఎండార్స్మెంట్ వేసి ఇవ్వాలని చెప్పారు. ఆశాజనక ఫలితాలు రాని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్ లతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు వివిధ సమస్యలపై 304 వినతులు అందజేశారు. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 80, జీవీఎంసీ 66, పోలీస్ శాఖవి 22 ఉండగా, మరొక 136 ఇతర అంశాలకు చెందినవి ఉన్నాయి. దీనిలో భాగంగా కలెక్టర్ గత వారం జరిగిన పీజీఆర్ఎస్ పై సమీక్ష చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆనందపురంలో రైతు బజార్ ఏర్పాటుకు కృషి
మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామినాయుడు

విశాలాంధ్ర - అనందపురం : వేముల వలస జంక్షన్ వద్ద తరచు తీవ్రమైన రద్దీ రాకపోకల ఇబ్బంది దృష్ట్యా ఆనందపురం కూడలిలో రైతు బజార్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటానని భీమిలి మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు వెల్లడించారు. సోమవారం భీమిలి మార్కెట్ యార్డులో నిర్వహించిన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రైతులు నేరుగా తమ పంటలు అమ్ముకునే విధంగా ఆనందపురంలో రైతుబజార్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రజలు అధిక ధరలకు కూరగాయలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో ఈ చర్య అవసరమని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీలో ఆనందపురం మండలానికి చెందిన ముగ్గురు సభ్యులు ఆనందపురం గ్రామానికి చెందిన జనసైనికురాలు కుప్ప రామలక్ష్మి, పెద్దిపాలెం గ్రామానికి చెందిన బీజేపీ దళిత నాయకురాలు ఉప్పాడ గౌరీ, చిన్నయ్య పాలెం గ్రామానికి చెందిన గిరిజన రైతు, మాజీ జడ్పిటిసి మారిక నూకరాజులు భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారీగా రాజకీయ నేతలు హాజరయ్యారు. జనసేన నుండి తమ్మిన అప్పలరాజు, కోరుకొండ మూర్తి, బాలు, శివ కృష్ణ, ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు. తెలుగుదేశం నుండి బీఆర్‌బీ నాయుడు, సురాల సత్య వరప్రసాద్, పాండ్రంగి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నుండి ఉప్పాడ అప్పారావు, ప్రసాదరావు పట్నాయక్, మీసాల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ కార్మికులకు వెంటనే వేతన బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర - భీమిలి : విశాఖ జీవీఎంసీ భీమిలి బీచ్ కార్మికులుగా పని చేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా వేతనం బకాయిలు చెల్లించలేదని! భీమిలి జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తూ నిరసన తెలియజేశారు ఈ సందర్భంగా సిఐటియు భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్ ఎస్ ఎన్ మూర్తి గారు మాట్లాడుతూ బీచ్ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించలేదని కార్మికులు ఎలా బతుకుతారని! ఇప్పటికే నిత్యవసర ధరలు విద్య వైద్యం కార్మికులకు అందనంత దూరంలో ఉన్నాయని! ఈ కార్మికులకు కనీస వేతనాలు 26,000 చెల్లించడం లేదని ఉన్న వేతనాలే నెలలు తరబడి బకాయిలు పెడుతున్నారని! జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించి బకాయి పడ్డ వేతనాలు వెంటనే చెల్లించాలని కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని! మున్సిపల్ చట్టాలన్నీ వీరికి వర్తింప చేయాలని! జోనల్ కమిషనర్‌కు మెమోరండం ఇవ్వడం జరిగింది! ఈ కార్యక్రమంల భీమిలి జోన్ సిఐటియు కార్యదర్శి ఎస్ అప్పలనాయుడు నాయకులు పంపాను నారాయణ నెక్కల్ల అప్పారావు చిన్న పుష్ప వెంకటలక్ష్మి యమునా తదితరులు పాల్గొన్నారు.

మూడు దశల్లో హర్‌ఘర్ తిరంగా : జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మూడు దశల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని, దేశభక్తి భావజాలాన్ని ప్రజల్లో నింపే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. పౌరులు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయుట, ర్యాలీలు చేపట్టుట, ఇతర కార్యక్రమాల నిర్వహణలో ప్రోత్సాహం అందించాలని చెప్పారు. ఈ మేరకు సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వుల కాపీని అధికారులకు చదివి వినిపించారు. మొదటి దశ ఆగస్టు 02 నుంచి 08వ తేదీ వరకు, రెండోది 09 నుంచి 12వ తేదీ వరకు, 13 నుంచి 15వ తేదీ వరకు మూడో దశ ఉంటుందని వివరించారు.తిరంగతో సెల్ఫీ, ప్రభాత్-ఫెరిస్, తిరంగ ర్యాలీలు (బైక్, సైకిల్ ర్యాలీలు సహా), తిరంగ ప్రదర్శనలు, ఇతర అట్టడుగు స్థాయి జనభాగీదారీ కార్యక్రమాలు ఇమిడి ఉంటాయని స్పష్టం చేశారు. అధికారులు, ప్రజలు హర్ ఘర్ తిరంగా వేడుకల్లో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, టూరిజం అధికారిణి జె. మాధవి పాల్గొన్నారు.

నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా పిల్లల దత్తత

విశాలాంధ్ర - విశాఖ : కేంద్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం పిల్లల దత్తత ప్రక్రియను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పాన్ కార్డు, ఆదాయ, వయస్సు, నివాస, వివాహ, ఆరోగ్య ధృవీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని, ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొంటూ సంబంధిత పోస్టర్ను సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సూచనలు చేశారు. దత్తత తీసుకోవాలనుకునే వారు అదనపు సమాచారం కొరకు దగ్గరలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని, ఐసీడీఎస్ పీడీ, ఇతర అధికారులను గానీ, జిల్లా బాలల పరిరక్షణ అధికారిని గానీ లేదా wws.cara.wcd.gov.in వెబ్ సైట్‌ను సంప్రదించవచ్చని సూచించారు. పోస్టర్ ఆవిష్కరణలో ఆయనతో పాటు జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ప్రతి వ్యక్తికి ఉండాలి
నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ప్రతి వ్యక్తి వద్ద ఉండాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరం వద్ద విశాఖ జిల్లా కలెక్టర్ ఎమ్ ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రజా ఆరోగ్య విభాగం అధికారులు ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ పరీక్షల తోపాటు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ పై జీవీఎంసీ ఉద్యోగుల తో పాటు ,ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుదారుల అవ గాహన కొరకు ప్రత్యేక కార్యక్రమాన్ని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ ఎన్ వి.నరేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నగర మేయర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారం భించారు. ఈ హెల్త్ ఐడి 14 నెంబర్లు కలిగి ఉంటుందని, ఇందులో వ్యక్తి యొక్క ఆరోగ్య పరీక్షలు, మందులు మొదలైనవి నిక్షిప్తమై ఉంటాయని తద్వారా ఆరోగ్య సమస్యలు ఏర్పడి నప్పుడు ఏ హాస్పిటల్ కి వెళ్లిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు చూపిస్తే మెరుగైన వైద్య సేవలు అందిం చేందుకు వీలుంటుంది అన్నారు. ఇటువంటి కార్యక్రమం మన జీవీఎంసీలో ఏర్పాటు చేయడం శుభపరిణామమని ఇలాగే ప్రతి వార్డులో కూడా ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి నగరంలోని ప్రతి పౌరుడికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు అందేలా చూడాలని అధికారులను మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి, డిపిఓ-ఎన్ హెచ్ యు ఎం.శశి భూషణ్, ఏఎన్ఎంలు, ఇతర ప్రజా ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న స్వామి హుండీ ఆదాయం రూ.2,78, 53,475

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం వరహాలక్ష్మినరసింహ స్వామి వారి హుండీ ఆదాయం రూ.2,78, 53,475 లభించింది. స్వామి వారికి భక్తులు ముడుపులు మొక్కుబడులు రూపంలో బంగారం 099.500 మిల్లీ గ్రాములు, వెండి 11 కేజీల 350 గ్రాములు సమర్పించినట్లు ఇంచార్జ్ కార్య నిర్వాహణాధికారి వి.త్రినాథరావు తెలిపారు. అదే విధంగా విదేశీ భక్తులు వారి కరెన్సీలో యూఎస్ 744 డాలర్లు, ఆస్ట్రేలియా 110 డాలర్లు, యూరప్ 55 డాలర్లు, టర్కీ 260, కెనడా 5, న్యూజిలాండ్ 20, సింగపూర్ 2, యూఏఈ 180, సౌదీ అరేబియా 5, నేపాల్ 10, మలేషియా 2, ఇండోనేషియా 10 వేల డాలర్లు, సమర్పించినట్టు కార్యనిర్వాహకులు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల వెంటనే రద్దు చేయాలి
ఏఐటీయూసీ నేత వామనమూర్తి డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ : కూటమి ప్రభుత్వం స్మార్ట్ విద్యుత్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని, ట్రూ ఆఫ్ విద్యుత్ సహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వ ర్యంలో ద్వారకా నగర్ బుద్ధిని పార్క్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్ నిరసన చేశారు. రుషికొండ జంక్షన్ లో ఫోటోగ్రాఫర్లు, ఆటో డ్రైవర్లు, చిల్లర వర్తికులతో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామన మూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆదాని లబ్దికోసం విద్యుత్ స్మార్ట్ మీటర్లు ట్రూ ఆఫ్ అదనపు విద్యుత్ చార్జీ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఎన్నికల్లో టిడిపి గెలిస్తే విద్యుత్తు చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారులకు వచ్చిన వెంటనే విద్యుత్తు చార్జీలను భారీగా పెంచి ప్రజల మీద భారాలు వేయడం అన్యాయం అన్నారు. నారా లోకేష్ ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని పిలుపునిచ్చిన అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మేటర్ ను పెట్టండిని ప్రజలపై ఒత్తిడి తేవడం దుర్మార్గం అన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లు చార్జీలను చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు టావ్ విద్యుత్ ఛార్జీలను ప్రజలు వ్యతిరేకించే ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

బీజేపీ జిల్లా కార్యదర్శి గొర్లెను సత్కరించిన విశ్వబ్రాహ్మణ పంచ వృత్తుల సొసైటీ

విశాలాంధ్ర - పెందుర్తి : అనకాపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ జనరల్ సెక్రటరీగా నూతనంగా నియమితులైన గొర్లె రామునాయుడును, జిల్లా విశ్వబ్రాహ్మణ పంచవృత్తుల సంక్షేమ సొసైటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కమిటీ సభ్యులు రామునాయుడును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గీయుల సమస్యలను, ఎంపీ సీఎం రమేష్ నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని, అలాగే కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు సామాజిక భవనం గురించి ఎంపీ దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో అనకాపల్లి జిల్లా విశ్వబ్రాహ్మణ పంచ వృత్తుల సంక్షేమ సొసైటీ కార్యవర్గానికి అన్ని నియోజక వర్గాల్లోను పార్టీ పరంగా ప్రాధాన్యత కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ కౌశల్ యోజన పథకం గురించి వివరించి, అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి పథకం అందే విధంగా ప్రయత్నిస్తానని విశ్వబ్రాహ్మణ పంచవృతల సంక్షేమ సంఘం సభ్యులకు గొర్రె రామా నాయుడు హామీ ఇచ్చారు.

శిథిలావస్థకు చేరుకున్న ఎంపీపీ స్కూల్

- పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డీఈఓ సునీత
- శిథిల భవనం కూల్చివేతకు ఆదేశాలు

విశాలాంధ్ర - గాజువాక : జీవీఎంసీ 85వ వార్డు పరిధి బీసీ కాలనీ ఎంపీపీ పాఠశాలలో ఒక భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ క్రమంలో ఆ భవనం ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉన్నదన్న భీతితో విద్యార్థులు వారి తల్లిదండ్రులు గ్రామ పెద్దలు విద్యాశాఖ దృష్టికి తీసుకువెళ్లారు. వెనువెంటనే విద్యాశాఖ స్పందించింది. జిల్లా పరిషత్ డిప్యూటీ డిఇఓ ఎం సునీత సోమవారం ఆ పాఠశాలను సందర్శించారు. ప్రమాద హేతువు ఉందని గుర్తించిన అధికారి తక్షణం తొలగించడానికి అనుమతి ఇచ్చారు. ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ఉక్కు నగరం విశాఖ విమల విద్యాలయం మూసి వెయ్యడం వలన అక్కడ చదువుచున్న 1700 మంది విద్యార్థులు 1 నుండి 10వ తరగతి వరకు చదువుతున్నారని తెలిపారు. వీరంతా అగనంపూడి, వడ్లపూడి, దేశపాత్రునిపాలెం, దుర్గా నగర్, ఇస్లాంపేట ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేరడం జరిగిందన్నారు. వారికి స్కూల్ యూనిఫారం, షూస్, బుక్స్ ఏర్పాటు చేయాలని, గత ప్రభుత్వంలో నాడు నేడు నిధులు ద్వారా పాఠశాలలో ఆధునీకరణ చేసి చివరిలో వదిలిపెట్టడం జరిగిందని వివరించారు.కొన్ని కొన్ని పాఠశాలలకు ఆ నిధులు వచ్చినప్పటికీ వాటిని వాడరాదని విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చిన సంగతి గుర్తు చేశారు. వెంటనే పెండింగ్ పనులు పూర్తి చేయాలని విద్యా శాఖ దృష్టికి తీసుకువెళ్లారు. డిప్యూటీ డీఈవో ఎం సునీత మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేయడం జరిగిందని. అంశాలు వారీగా ఒక్కొక్క పని చేసుకొని వస్తుందని ప్రభుత్వ పాఠశాలలో చేరిన ఉక్కు నగరం విశాఖ విమల విద్యాలయ విద్యార్థులకు షూస్ స్కూల్ యూనిఫారం బుక్స్‌కి ఇండెంట్ పెట్టడం జరిగిందన్నారు. త్వరలోనే వస్తాయని తెలిపారు. పాఠశాలలో అసంపూర్ణంగా మిగిలిపోయిన పనులను విద్యాశాఖ ప్రభుత్వ దృష్టిలో పెట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా ఇటీవల నూతన ఉపాధ్యాయులని కూడా ఎంపిక జరుగుతోందని అన్నారు. సమాజంలో కార్పొరేట్ పాఠశాలకి దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ లేని పాఠశాలలో తమ పిల్లలు చేర్చి నష్టపోవద్దని ఆమె హితవు పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుంగల ఇందిరా ప్రియదర్శిని సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కొర్రయి జగదీష్, గంతకోరు సత్యవతి పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రి రాంబాబు వైస్ చైర్మన్ నిల్లి సంతోషి మెంబరు శ్యామలక్ష్మీ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర - భీమిలి : కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు సోమవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నా కు సంఘీభావం తెలిపిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ ఎస్

ఎస్ మూర్తి మాట్లాడుతూ, అంగన్వాడీలకు కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని, యాప్‌ల భారం, అంగ న్వాడీ లకు పని ఒత్తిడి తగ్గించాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా ఏర్పాటు చేస్తూ జీఓ జారీ చేయాలని, గ్రాడ్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయ కులు ఎస్.అప్పలనాయుడు, పి.సూర్య నారాయణ, నీలాతి రాము, ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటి యు) ప్రాజెక్ట్ నాయకులు శ్రీదేవి, నరసయ్యమ్మ, సుగుణ, సీత పాల్గొన్నారు.

నో ఫోన్... నో వర్క్..

- ఆన్‌లైన్ సేవలు బహిష్కరించిన అంగన్వాడీలు
- ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయం ఎదుట సెల్ ఫోన్‌లను రోడ్డుపై ఉంచి నిరసన తెలిపిన అంగన్వాడీలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : రేపటి నుండి అంగన్వాడీ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో నో ఫోన్ నో వర్క్ విధానాన్ని పాటిస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి (ఏఐటీయూసీ) ఎం.వెంకట లక్ష్మీ అన్నారు. సోమవారం సాయంత్రం మర్రిపాలెం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కార్యాలయం వద్ద ఫోన్లు మాకొద్దు అంటూ వినూత్న నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈమేరకు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి పోషణ ట్రాకర్ యాప్, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి బాల సంజీవిని యాప్ లతో పని భారం పెరగడంతో పాటుగా అదనంగా ఆరోగ్య శాఖ కు చెందిన ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం ద్వారా ఏఎన్ఎం, ఆశ వర్కర్‌లు చేయవలసిన గర్భిణీ బాలింతల నమోదు ప్రక్రియ సైతం తమకే అప్పగించడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఇప్పటికే చాలీ చాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో అదనంగా యాప్ లను జోడించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క ఆన్ లైన్ విధానంతో సర్వర్ పని చేయకపోవడం, సెల్ ఫోన్ లు మొరాయించడంతో లబ్ధి దారులు అంగన్వాడీ కేంద్రాల చుట్టూ తిరుగుతూ తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని మరో పక్క కిశోర్ వికాస్, మిషన్ వాత్సల్య, సఖి గ్రూప్ లు గా ఏర్పాటు చేసి అందులో స్థానిక నాయకులను, సచివాలయ

సిబ్బందిని సమన్వయం చేసిప్రతి మొదటి శుక్రవారం, మూడవ శుక్రవారం సమావేశం నిర్వహించాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని అంగన్వాడీ లు వాపోతున్నారు. దీంతో తాము ప్రీ స్కూల్ పై దృష్టి సారించలేకపోతున్నామని అంటున్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి శ్యామలాదేవి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చేపడుతున్న ప్రతి కార్యక్రమాలకు సంబంధించి బ్యానర్ లు ఇతరితర ఖర్చులు తామే భరిస్తున్నామని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వేతనాలకు సంబంధించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టిన సమయంలో టీడీపీ నాయకుడు ఇప్పటి విద్య శాఖ మంత్రి నారా లోకేష్ తాము అధికారంలోకి రాగానే రోజుల వ్యవధిలో పని భారం తగ్గించి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని అయితే ఏడాదిన్నర అయిన అంగన్వాడీ లను పూర్తిగా విస్మరించారని అన్నారు. ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించి ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి పోషణ ట్రాకర్ యాప్, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి బాల సంజీవిని యాప్ లను ఒకటిగా చేయడంతో పాటుగా తమకు పని భారం తగ్గించే విధంగా ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం ద్వారా రూపొందించిన యాప్ ను తిరిగి ఆరోగ్య శాఖ అధికారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ ప్రభుత్వం తీరు మారకపోతే అంగన్వాడీ లు ఒకటై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం అర్బన్ సిడిపిఓ నీలిమ కు తమ సెల్ ఫోన్ లను అప్పగించే ప్రయతం చేసిన అంగన్వాడీలకు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేయడం వలన డేటా పోయే ప్రమాదముందని త్వరలో అంగన్వాడీ లకు ఐదు జీబి నెట్ వర్క్‌తో కూడిన సెల్ ఫోన్‌లు అందజేయడం జరుగుతుందని అంగన్వాడీ లకు సర్ది చెప్పడంతో సిడిపిఓకి వినతి పత్రం అందజేసి వెను తిరిగారు. ఈ కార్యక్రమంలో ఈ యూనియన్ గౌరవ అధ్యక్షులు వడాల రమణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటియుసి నాయకుల. వి కృపారాణి. ఏ.నూకరత్నం అన్నపూర్ణ దేవి . సుబ్బలక్ష్మి. సుజాత.పాప వేణి. పద్మ. రమా పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యా ప్రయత్నం ... రక్షించిన పెందుర్తి పోలీసులు

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవీఎంసీ 96 వ వార్డు పులగాల పాలెం, సూర్య నగర్‌లో ఓ మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించగా పెందుర్తి పోలీసులు సకాలంలో స్పందించి ఆమెను రక్షించారు. సిఐ సతీష్ కుమార్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం 8:45 గంటల సమయంలో డయల్ 112 ద్వారా పులగానిపాలెం ప్రాంతంలో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నిస్తున్న సమాచారం అందింది. వెంటనే స్పందించిన బ్లూ కోల్ట్ పోలీసు కానిస్టేబుల్ చంద్రశేఖర్, సెక్షన్ హెడ్ కానిస్టేబుల్ అప్పారావు సంఘటనా స్థలానికి వేగంగా చేరుకొని, తలుపు పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించి ఆత్మహత్య యత్నంలో ఉన్న ఎల్.శశిలేఖ (31) అనే మహిళను సురక్షితంగా రక్షించారు. ప్రాథమిక విచారణలో ఆమె భర్తతో తరచూ జరుగుతున్న కుటుంబ కలహాల కారణంగా మానసికంగా కలతకు గురై ఈ దారుణ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఆమె భర్త డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దంపతులకు ఒక 11 సంవత్సరాల కూతురు, 10 సంవత్సరాల కుమారుడు ఉన్నారు. పోలీసులు బాధితురాలికి మనోధైర్యాన్ని పునరుద్ధరించి, ఆమె అభిప్రాయం స్వీకరించిన అనంతరం, ఆమె చెబుతున్న వివరాల ప్రకారం అవసరమైన కౌన్సిలింగ్, చట్టపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టారు.

రెండు నెలల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలి

జీవీఎంసీ అధికారులను ఆదేశించిన గంటా

విశాలాంధ్ర - పీఎం పాలెం : జీవీఎంసీ 7 వ వార్డు చంద్రంపాలెం జాతీయ రహదారి పక్కన ఉన్న డ్రెయిన్లలో పూడికతీత పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. మురుగుతో నిండిపోయిన డ్రెయిన్లను మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మిలతో కలిసి సోమవారం పరిశీలించారు. అనేక ఏళ్లుగా పూడిక తీయకపోవడం వల్ల 3 అడుగుల మేర వ్యర్థాలు మేట వేశాయన్నారు. రూ. 75 లక్షలతో డ్రెయిన్లు శుభ్రం చేసే పనులను ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని మనుషులతో చేయించడం వల్ల ఆలస్యమవుతుందని అంటున్నారని, వేగంగా.. నాణ్యంగా పనులు పూర్తి చేయడానికి అవసరమైతే మెషీన్‌లు వినియోగించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పోలీస్ సిబ్బందిని ఇస్తామన్నారు. అపార్ట్మెంట్‌ల నుంచి వచ్చే వాడుక నీటిని జీవీఎంసీ డ్రెయిన్లలో కలపడాన్ని అడ్డుకునే వారి పట్ల కఠినంగా ఉండాలని పేర్కొన్నారు. తాగునీరు సరఫరా సరిగా లేదని స్థానికులు తెలియజేయగా.. అందరికీ మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. జాతీయ రహదారికి సర్వీస్ రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్ లో 2 నుంచి 3 అడుగులు సర్వీస్ రోడ్డులో కలిపితే ట్రాఫిక్ సమస్య కొంత పరిష్కారమవుతుందని. ఆ దిశగా ఆమోదయోగ్య ప్రతిపాదన సిద్ధం చేయాలన్నారు. అలాగే చంద్రంపాలెంలో నిర్మించిన బస్ షెల్టర్ల వద్ద బస్సులు ఆపడం లేదని ఈ ప్రాంత మహిళలు ఫిర్యాదు చేయగా ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి అన్ని బస్సులు ఆగేట్టు చేస్తానని హామీ ఇచ్చారు.

ఎండాడ భూ కుంభకోణంపై 2 నెలల క్రితమే లేఖ రాశా...

ఎండాడలో మాజీ సైనికోద్యోగి భూమి విషయంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు లేఖ గురించి మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, తాను రెండు నెలల క్రితమే ఈ భూమిపై వస్తున్న ఆరోపణలపై విచారణ చేయాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశానన్నారు. తప్పు చేసిన వారికి తగిన శిక్ష ఉండాలని, భూ కుంభకోణంపై అధికారులు నిగ్గు తేల్చాల్సి ఉందని గంటా తెలిపారు. అలాగే స్మార్ట్ మీటర్లు బిగించే ఆలోచన ప్రస్తుతానికి లేదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతిరాజు, కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, పిల్లా వెంకట్రావు, అచ్యుతరావు, గరే గుర్నాథ్, జానకిరామ్, నాగోతి సత్యనారాయణ, రమణ, మామిడి దుర్గారావు, బోయి శ్రీను, నాగోతి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులతో మంత్రి నాదెండ్ల సమీక్ష

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. అనంతగిరి పర్యటనలో ఉన్న ఆయన 05వ తేదీ ఉదయం 11.30 గంటలకు విశాఖపట్టణం కలెక్టరేట్‌కు చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం వరకు ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు, జీసీసీ అధికారులతో జరిగే రీజినల్ కాన్ఫరెన్స్ లో పాల్గొంటారు. భోజన విరామం తర్వాత సాయంత్రం 3.00 గంటల నుంచి కలెక్టరేట్ మీటింగు హాలులోనే పోర్టు అధికారులతో సమావేశమై బియ్యం ఎగుమతులు, ఇతర అంశాలపై సమీక్షిస్తారు. తదనంతరం లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఈ మేరకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

29న విశాఖలో ప్రో కబడ్డీ లీగ్

వైజాగ్, జైపూర్, చెన్నై, ఢిల్లీ నగరాలు వేదికలుగా కబడ్డీ సందడి

విశాలాంధ్ర - విశాఖపట్నం : కబడ్డీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ ఆగస్టు 29న న విశాఖ ప్రధాన వేదికగా ప్రారంభం కానుందని ఈ సందర్భంగా ప్రో కబడ్డీ లీగ్ రీజనల్ హెడ్ అనుపమ్ గోస్వామి తెలిపారు. ఈ మెగా టోర్నమెంట్, నాలుగు ప్రధాన నగరాల్లో అభిమానులకు అసలైన కబడ్డీ మజాను అందించనుందన్నారు. ఈసారి వైజాగ్, జైపూర్, చెన్నై, ఢిల్లీ నగరాలు 12 జట్లు తలపడే ఈ మెగా లీగ్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాయి అని చెప్పారు. 12వ సీజన్ ప్రారంభ వేడుకలు వైజాగ్‌లోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో అట్టహాసంగా జరగనున్నా యన్నారు. ఆగస్టు 29 శుక్రవారం జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్‌తో తలపడనుందని, అదే రోజు జరిగే రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్, పుణేరి పల్టాన్‌ను ఢీకొట్టనుందన్నారు. ఆగస్టు 30న, తెలుగు టైటాన్స్ మరోసారి బరిలోకి దిగి యూపీ యోధాస్‌తో పోటీపడనుందని, ఆ తర్వాత జరిగే మ్యాచ్‌లో యు ముంబా, గుజరాత్ జెయింట్స్‌తో తలపడనుందన్నారు. ఇక సూపర్ సండే 31 తలైవాస్, యు ముంబా మధ్య హెరాహెరీ పోరు జరగనుండగా, డిఫెండింగ్ చాంపియన్ హర్యానా స్టీలర్స్ తమ టైటిల్ వేటను బెంగాల్ వారియర్స్ మ్యాచ్‌తో ప్రారంభించనుందన్నారు. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత పీకేఎల్ మళ్లీ వైజాగ్‌కు రావడం విశేషం అని, గతంలో 2018లో ఆరో సీజన్‌కు అంతకుముందు 1, 3 వ సీజన్ పోటీలకు అతిథ్యం ఇచ్చిన ఈ నగరంలో ఇప్పుడు మళ్ళీ కబడ్డీ సందడి నెలకొననుందని చెప్పారు.

స్పా సెంటర్‌పై పోలీసులు దాడి పలువురి అరెస్ట్

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్ : ఈరోజు స్పా సెంటర్‌లో వ్యభిచారం జరుగుతోందనే విశ్వసనీయ సమాచారం మేరకు, సిటిఎఫ్ బృందం ఎంవిపి కాలనీలోని గిరిజన్ భవన్ సమీపంలోని సెక్టార్-5లోని యాక్షన్ బ్యూటీ జోన్ యునిసెక్స్ సెలూన్ స్పా సెంటర్‌పై దాడి చేసి, స్పా యాజమాన్యంను ఇద్దరు వ్యక్తులను, ఇద్దరు కస్టమర్లను, 6 మంది బాధితులను అరెస్టు చేసి, చర్య కోసం ఎంవిపి పోలీస్ స్టేషన్కు అప్పగించారు

జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 99 వినతులు

నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 99 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివి ఎంసి ప్రధాన కార్యాలయం లోని పాత సమావేశ మందిరం లో అదనపు కమీషనరు డి.వి.రమణమూర్తి తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 99 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 02, 2వ జోన్ కు 16, 3వ జోన్ కు 11, 4వ జోన్ కు 06, 5వ జోన్ కు 14, 6వ జోనుకు 18, 7వ జోన్ కు 04, 8వ జోన్ కు 15, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 13 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ అకౌంట్సు విభాగమునకు 04, రెవెన్యూ విభాగమునకు 10, ప్రజారోగ్య విభాగమునకు 05, పట్టణ ప్రణాళిక విభాగమునకు 54, ఇంజినీరింగు విభాగమునకు 18, మొక్కల విభాగమునకు 02, యుసిడి విభాగమునకు 06 కలిపి మొత్తంగా 99 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం అదనపు కమీషనరు మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను అదనపు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు పల్లమరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవ రెడ్డి, ఫైనాన్సర్ అడ్వైజర్ మల్లికాంబ, సిసిపి ఏ.ప్రభాకర రావు డీసీఆర్ ఎస్. శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజనీర్లు పి.వి.వి. సత్యనారాయణ రాజు, కె.వి.ఎన్ రవి, కె.శ్రీనివాసరావు, వై.కృష్ణారావు, కార్యనిర్వాక ఇంజినీరు శ్రీధర్, డిడిహెచ్ ఎం. దామోదర రావు,పిడి-యుసిడి పి.ఎమ్.సత్యవేణి, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.ప్రసన్న వాణి, డిపిఓ విజయశంకర్, శాంతి కుమారి, మేరీ గోల్డ్, డీసీపీలు హరిదాసు, రామ్మోహన్, వెంకటేశ్వరరావు ,ఏసీపీ లు రామలింగేశ్వర రెడ్డి, వెంకటరావు, రామక్రిష్ణ, షబ్నమ్ శాస్త్రి, స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, బయాలజిస్ట్ సాంబమూర్తి, ఎస్టేట్ ఆఫీసరు పి.సన్యాసినాయుడు, టి.పి.ఆర్.ఒ రజినికుమారి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ దందాను ఆపండి... కలెక్టర్‌కు విన్నపం

విశాలాంధ్ర - పద్మనాభం : పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 74/1 లో అక్రమ మైనింగ్ జరుగు తున్నట్లు తాలాడ రమేష్ అనే యువకుడు విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడం జరిగినది. వివరాలు ఇలా ఉన్నాయి .కృష్ణాపురం సర్వేనెంబర్ 77/1లో రెండు ఎకరాల ల 47సెంట్లు విస్తరణం కలిగిన నల్ల క్వారీలో అక్రమంగా నల్లరాయిని ప్రైవేటు క్వారీ యజమానులకు వారికి కావలసిన సైజులో మొకార. అప్పలనాయుడు మరియు అతని కుమార్తె ప్రస్తుత సర్పంచ్ మోకర లక్ష్మీ భవాని అండ దండలతో మొకర నాగరాజు, మొకర గౌరీ నాయుడులు కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు అడ్డు అదుపు లేకుండా ఎంతో విలువైన నల్లరాయిని అక్రమ మైనింగ్ చేస్తూ లక్షల్లో సంపాదిస్తున్నారని ఫిర్యాదు చేయడం జరిగింది. ఒక లోడు రాయిని సుమారు 1500 రూపాయలు కమిషన్‌తో అక్రమ మైనింగ్ వ్యాపారం చేస్తున్నారు. అదే చోట భూమి లోపలికి భూగర్భంలోకి సుమారు 20 నుంచి 30 అడుగులు డ్రిల్లింగ్ చేసి బ్లాస్టింగ్ చేయడం వల్ల దానికి అనుకుని కొంచెం దూరంలో ఉన్న ఇల్లు కూడా అదురుతూ ఉన్నాయి. చుట్టుపక్కల ఉన్న పాడి పశువుల రైతులు అందరూ కూడా బ్లాస్టింగ్ జరగడం వల్ల ఆవులన్నీ భయంతో పరుగు పెడుతున్నాయని తెలియజేశారు. కొన్ని కొన్ని సందర్భాల్లో సమయపాలన లేకుండా బ్లాస్టింగ్లు చేస్తూ పాడి పశువులు గొర్రెలు మేకలు పశువులు కాపరులు సమయపాలన లేని మైనింగ్ బ్లాస్టింగ్ వల్ల తీవ్ర ఇబ్బంది గురవుతున్నారు అని ఫిర్యాదులో తెలియజేయడం జరిగినది. దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి మా గ్రామానికి పాడి పశువులకు మేలు చేయవలసిందిగా కోరడం జరిగింది.

ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - పెందుర్తి : స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ లో విశాఖ బ్లడ్ సెంటర్, ఆదర్శ్ ఎన్.ఎస్.ఎస్ 1, 2,3 యూనిట్ల ఆధ్వర్యంలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎన్ ఈ ఫ్లోరా తెలియజేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపులో విశాఖ బ్లడ్ సెంటర్ ప్రాజెక్టు డైరెక్టర్ రామ్ రవి శంకర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రజ్ఞత, టెక్నికల్ మేనేజర్ నాయుడు, టెక్నీషియన్లు అనూష, శ్రీను, గౌరీ, సునంద పాల్గొన్నారని వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి. థియోఫిలస్ మాట్లాడుతూ ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ ప్రతి 6 నెలలకు ఒకసారి రక్తదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇదే స్ఫూర్తితో మరిన్ని బ్లడ్ డొనేషన్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఈ విధంగా ఆదర్శ్ విద్యార్థులు సమాజ సేవలో ముందుంటున్నారని ఈ బ్లడ్ డొనేషన్ క్యాంపులో విద్యార్థులు భాగస్వాములు కావడం శుభ పరిమాణం అని చెప్పారు. ఎన్.ఎస్.ఎస్, యుబిఏ ఆధ్వర్యంలో జరిగిన ఈ బ్లడ్ డొనేషన్ క్యాంపును ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.మంజుల, సంధ్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ రాజ కుమార్, ఏఓ రవిబాబు, సింహాచలం పర్యవేక్షించారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు ప్రత్యేక కృషి చేయాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : స్వర్ణాంధ్ర ఏ 2047 ప్రణాళికకు అనుగుణంగా నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ఆయా శాఖల అధికారులంతా ప్రత్యేక కృషి చేయాలని, పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కీపీఐ(కీ ఫెర్మార్మెన్స్ ఇండకేటర్స్)లో పేర్కొన్న అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. ఏపీ-4 మార్గదర్శుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇది పూర్తిగా స్వచ్ఛంద కార్యక్రమమని, దానికి తగిన విధంగానే చర్యలు తీసుకోవాలని, ఎవరిపైనా ఒత్తిడి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏప్రభుత్వం ప్రజలందరికీ అన్ని రకాల డాక్యుమెంట్లను అందుబాటులో ఉంచేందుకు ఉద్దేశించిన ఈపీటీఎస్ (ఎలక్ట్రానిక్ ఫెర్మార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్స్) ప్రక్రియకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా అధికారులు ఆయా శాఖ పరిధిలో వచ్చిన జీవోలు, మెమోలను ప్రత్యేక లాగిన్ ద్వారా అప్లోడ్ చేయాలని సూచించారు.

కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసింది

- రైతులకు కావలసిన యూరియాను వెంటనే సప్లై చేయాలి
- వైసీపీ జిల్లా అధ్యక్షులు కేకే రాజు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసిందని వైసిపి జిల్లా అధ్యక్షులు కేకే రాజు విమర్శించారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, యూరియా కొరతపై సోమవారం జిల్లా రైతాంగం తరపున కేకే రాజు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు జిల్లా కలెక్టర్ నరేందర్ ప్రసాద్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలనలో 250 మంది అన్నదాతలు ఆత్మహత్యచేసుకున్నారన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందన్నారు. రైతును రాజుగా చూడాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో జగన్మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతు విత్తనం వేసిన దగ్గర నుండి పంటకు మద్దతు ధర వచ్చేవరకు రైతన్నలకు జగన్ సర్కారు భరోసాగా ఉండేది అని అన్నారు. నేడు వాటిని నిర్వీర్యం చేసారన్నారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో రైతులకు కావలసిన యూరియా కేటాయింపు విషయంలో డిమాండ్ కు సరిపడా సప్లై లేదని మండిపడ్డారు. రాజకీయాల్లో 40 సంవత్సరాలు అనుభవం ఉందని సంపద సృష్టిస్తానని కల్లబొళ్ళు కబుర్లు చెప్పిన చంద్రబాబు రైతన్నకు కావలసిన యూరియా సరఫరా చేయలేక పోతున్నారు అని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా రైతులు మేలు కోరి రైతు సంక్షేమంను దృష్టిలో పెట్టుకొని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అంటే దేశానికి అన్నపూర్ణ వంటిదని అలాంటి రాష్ట్రాన్ని వ్యవసాయ రంగంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. రైతు భరోసా కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ నేను బ్రతికి ఉన్నంత వరకు రైతుకు భరోసా అనేది ఉండదు అని చంద్రబాబు నాయుడు అన్న మాటలకు రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వారికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రంలో అన్నదాత సంతోషంగా ఉంటేనే దేశం బాగుపడుతుందని వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని ఈ రాష్ట్రంలో అన్నదాత లను ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో శాసన మడలి సభ్యురాలు వరుదు కల్యాణి , సమన్వయ కర్తలు మళ్ళ విజయ ప్రసాద్, మొల్లి అప్పారావు, జిల్లా పరిశుత్తు వైస్ చైర్మన్ సుంకరి గిరి బాబు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవి రెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగ అధ్యక్షులు పేర్ల విజయ చంద్ర, పార్టీ ముఖ్య నాయకులు జహీర్ అహ్మద్, గోలగాని శ్రీనివాస్, అల్లంపల్లి రాజ బాబు, ఎం.పి.పి రాంబాబు, మండలమ అధ్యక్షులు బంకు సత్యం, పెదాడ రమణి కుమారి, బోని శివ రామకృష్ణ, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, వంకాయల మారుతి ప్రసాద్, నీలి రవి, రాష్ట్ర , కార్పోటర్లు శశికళ , బిపిఎన్ కుమార్ జైన్, జిల్లా పార్టీ మరియు అనుబంధ కమిటి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోల్‌కతాలో హౌస్ ఆఫ్ మెక్ డోవెల్స్ సోడా యారీ జామ్

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఫ్రెండ్ షిప్ డే పురస్కరించుకొని హౌస్ ఆఫ్ మెక్ డోవెల్స్ సోడా యారీని ఆకాశమే హద్దుగా కొత్త వేదికపై కొత్త ఎత్తులకు తీసుకెళ్తోంది. భారతదేశపు అతిపెద్ద బ్రాండెడ్ లైవ్ ఐపిగా, ట్రైబ్విబ్ ఎంటర్టైన్మెంట్ తయారు చేసి, ప్రమోట్ చేసిన యారీ జామ్, 36,000 అడుగుల ఎత్తులో మొట్టమొదటి జామ్ తో ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని గుర్తించింది. ఇక్కడ కింగ్ మరియు కర్మ కలిసి ఒక విమానాన్ని స్నేహం యొక్క మరపురాని క్షణంగా మార్చారు. ఇప్పుడు, ఈ ప్రయాణంలో అధ్యాయం కోసం కోల్‌కతాకి వస్తుంది. ఇంకా చెప్పాలంటే, హౌస్ ఆఫ్ మెక్ డోవెల్ యొక్క సోడా ఎల్లప్పుడూ యారీని ప్రోత్సహించింది - ఇది కేవలం వనిలా మాత్రమే కాదు, ఒక భావోద్వేగంతో ఉంటుంది. యారీ జామ్ యొక్క ప్రతి ఎడిషన్‌తో, ఈ బ్రాండ్ ప్రతి ఒక్కరినీ కలిపే దాని ద్వారా స్నేహంలో ఉండే నిజమైన సంబంధాలను సంగీతంతో సెలెబ్రేట్ చేసుకోవడానికి తన నిబద్ధతను బలోపేతం చేస్తుంది. ముంబై నుండి కోల్కతాకు ఒక ప్రైవేట్ చార్టర్లో, కళాకారులు కింగ్, కర్మ మరియు హాస్యనటులు రవి గుప్తా మరియు గుర్లీన్ పన్నూ మధ్య జరిగే ఈ ఎయిర్ జామ్ ఒక రకమైన కొత్త అనుభవంగా మార్చారు. మ్యూజిక్, కథలు, నవ్వు మరియు ఫిల్టర్ చేయని మంచి స్నేహం యారీతో నిండి ఉంది. ఇప్పుడు కోల్ కతాలో ఈ సిరీస్ ప్రారంభం కానుండటంతో కింగ్, ఫాజిల్స్, సనమ్, భార్గవ్ కాలే జట్లతో కూడిన బృందం బరిలోకి దిగనుంది. ఇది మరో కాన్సర్ట్ మాత్రమే కాదు. ఇది యారీ జామ్ స్నేహానికి మరియు సంగీతానికి నివాళి, మరియు మమ్మల్ని కలిపే స్నేహ బంధాల వేడుక. ఫ్రెండ్షిప్ డేను జీవితకాలపు జ్ఞాపకంగా మార్చుకోవడం కంటే మంచి మార్గం ఇంకోటి లేదు. మేము దీనిని తదుపరి స్థాయికి తీసుకెళ్లాలనుకున్నాము మరియు యారీ జామ్ ద్వారా దీనిని సెలెబ్రేట్ చేసుకోవడం కంటే మంచి మార్గం ఉండదు" అని డియాజియో ఇండియా ఉపాధ్యక్షులు, పోర్ట్ఫోలియో హెడ్ (మార్కెటింగ్) వరుణ్ కూరిచ్ అన్నారు.

అండర్ - 7 జిల్లా చెస్ ఛాంపియన్ గొర్లె నైనా

విశాలాంధ్ర - పెందుర్తి : విశాఖ జిల్లా అండర్ 17 ఓపెన్ అండ్ గర్ల్స్ -2025 చదరంగం సెలక్షన్స్ తుది ఫలితాలు సమతా డిగ్రీ కాలేజ్ వేదికగా, ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ తరుపున ఆదిత్య చెస్ అకాడమీ ఆర్గనైజర్‌గా నిర్వహించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రంగాల బాబురావు తెలియచేశారు. ఓపెన్ కోసం 135 మంది, గర్ల్స్ కోసం 54 మంది మొత్తం 189 పాల్గొన్నారని తెలిపారు. గెలిచిన మొదటి ఇద్దరు క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 17 ఓపెన్ అండ్ గర్ల్స్-2025 చాంపియన్షిప్ ఆగస్టు 16,17 తేదీలలో కాకినాడ జిల్లాలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు. ఓపెన్ కోసం 7రౌండ్లు,గర్ల్స్ 6 రౌండ్లు నిర్వహించినట్లు చెప్పారు. ఓపెన్ లో గొర్లి నైనా 7 పాయింట్లతో 500/- క్యాష్ ప్రైస్ తో మొదటి స్థానం, తనీష్ చోప్రా 6 పాయింట్లతో 400/- క్యాష్ ప్రైస్ తో రెండవ స్థానం, గెలుచుకున్నారని, గర్ల్స్ లో కుమారి ప్రసాద్ జాగృతి 6 పాయింట్లతో 500/- క్యాష్ ప్రైస్ తో మొదటి స్థానం, సాయి దీప్తి శివకోటి 5 పాయింట్లతో 400/- క్యాష్ ప్రైస్ తో రెండవ స్థానం, గెలుచుకున్నారని వెల్లడించారు. గెలిచిన క్రీడాకారులకు అతిధులు చేతులు మీదుగా క్యాష్ ప్రైస్, ట్రోఫీలు సర్టిఫికెట్లు అందించామన్నారు. కార్యక్రమంలోముఖ్యఅతిథిగా సునీల్ కుమార్ డైరెక్టర్ మనం వనం ఫౌండేషన్ డాక్టర్ బాబురావు ప్రెసిడెంట్ ఆల్ విశాఖ అసోసియేషన్, మణికంత సెక్రెటరీ ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ టోర్నమెంట్ డైరెక్టర్ ఎం రామకృష్ణ, ఆర్బిటర్స్ ఎం వి ఎస్ ప్రసాద్, సాయి, గీత, అనిల్, రవి, శ్రవంత్, తరుణ్, శశి.ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఎం ఎస్ పి కుమార్, నరేష్, కిరణ్ కుమార్, సుబ్బు పాల్గొన్నారు.

భావ తరంగం వైజాగ్ 2025 పోస్టర్ విడుదల

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : జన విజ్ఞాన వేదిక, ఓపెక్ ఆధ్వర్యంలో ఈ నెల 8న విశాఖ పబ్లిక్ లైబ్రరీలో నిర్వహించే "భావ తరంగం వైజాగ్ 2025" కార్యక్రమ పోస్టర్ ద్వారకానగర్ లో ఓపెక్ వ్యవస్థాపకురాలు ప్రియాంక దండి,కార్యదర్శి కాండవ గాయత్రి ,జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కే.పృధ్వి, జిల్లా అధ్యక్షుడు డా.విజయ్ చంద్రా విడుదల చేసారు. దేశంలో కొన్ని శక్తులు అవాస్తవాలను ప్రజల్లో ప్రచారం చేస్తూ లౌకికవాద దేశంలో ప్రజలను విభజించి, విష సమాచారం ద్వారా ప్రజలను ప్రభావితం చేసి అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. గాంధీ, నెహ్రూ,డా. బాబా సాహెబ్ అంబేద్కర్ వంటి జాతీయ నాయకుల పై విష ప్రచారం చేస్తున్నారని, అవమానిస్తున్నారని తెలిపారు. దానిని తిప్పి కొడుతూ లౌకికవాద, ప్రజాస్వామ్య దేశం భారత్‌ని రక్షించుకునేలా మేధావులు, ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేస్తామని ఓపెక్ వ్యవస్థాపకురాలు ప్రియాంక దండి తెలిపారు., జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ సెక్యూలర్ మరియు లౌకిక భారతదేశం మీద పెద్ద ఎత్తున దాడి జరుగుతోందని, కొన్ని శక్తులు ప్రజలను తప్పుద్రోవ పట్టిస్తున్నారని, దేశంలో అన్ని వ్యవస్థలను ప్రస్తుత పాలకులు తమ జేబు సంస్థలుగా మార్చేసు కున్నారని విమర్శించారు.జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డా.విజయ్ చంద్రా మాట్లాడుతూ మతాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయ క్రీడాకు తెరలేపరని, దేశాన్ని 100 సంవత్సరాలు వెనక్కి తీసుకువెళ్లారని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారు. జన విజ్ఞాన వేదిక దశాబ్దాలుగా పోరాటం చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, సంఘ సంస్కర్తలు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఓపెక్ మరియు జన విజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.